క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత


బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న గ్రామస్తులు

కేశంపేట: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామ శివారులోని అనుబంధ గ్రామమైన అవాజీమీయా పడకల్‌లో శుక్రవారం రాత్రి వానరాశి జంగయ్య మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, గ్రామానికి చెందిన నారాయణ రూ.5వేల చొప్పున, కుర్వగూడెం నర్సింలు రూ.3వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో అబ్బి సుందరయ్య, సూరమోని యాదయ్య పాల్గొన్నారు.

ఏపీ మంత్రిని కలిసిన నాయకులు


ఏపీ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

చేవెళ్ల: ఆంధ్రప్రదేశ్ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను మండల బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం ఆయన నియోజకవర్గంలోని మొయినాబాద్ మండలంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన ఆయనను వారు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎ.అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, పవన్ తదితరులు ఉన్నారు.

దేశానికి దిక్సూచి అంబేడ్కర్

బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రాజేందర్‌రెడ్డి


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు, మహిళలు

షాబాద్: రాజ్యాంగాన్ని రూపొందించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికి ఓ దిక్సూచిగా నిలిచాడని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొకుంట్ల రాజేందర్‌రెడ్డి, అంబేడ్కర్ విగ్రహ స్థాపన కమిటీ అధ్యక్షుడు చొక్కంపేట ఆంజనేయులు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని చర్లగూడ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ స్థాపన కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అబేండ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే ప్రస్తుత సమాజంలో అందరికీ గౌరవం దక్కుతుందన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘాల నాయకులు రాములు, రాజు, వసంత్ కుమార్, ప్రేమ్ కుమార్, మల్లేశ్, ప్రభాకర్, రాంచందర్, వెంకటేశ్, శ్రీనివాస్, గ్రామస్తులు, మహిళలు తదితరులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్


కూలీలతో మాట్లాడుతున్న శ్రీనునాయక్

కొందుర్గు: ఉపాధి హామీ పథకంలో కూలీలకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండలంలోని వెంకిర్యాల గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న పని ప్రదేశాన్ని సందర్శించి కూలీల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కూలీలు పనులు చేసి నెలలు గడుస్తున్నా డబ్బులు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. పనిచేస్తున్న సమయంలో సేద తీరడానికి టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. భూమిలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.12వేలు అందించాలని, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, నర్సింలు, యాదయ్య, మంగమ్మ, లింగమ్మ, పద్మమ్మ, స్వరూప, శివశంకర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

'వంద పడకల'కు మోక్షం ఎప్పుడో?


చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రి భవనం

- నిధులు మంజూరైనా స్థలం కేటాయింపులో జాప్యం
- ప్రస్తుత ఆస్పత్రిలో వసతులు లేక ఇబ్బంది పడుతున్న రోగులు, సిబ్బంది
- పట్టించుకోని అధికారులు

చేవెళ్ల: ప్రజల ఆరోగ్యాలకు ప్రభుత్వ ఆస్పత్రిలే రక్షణ. అలాంటి వాటిలో సమస్యలపై ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదు. దీంతో రోగులకు, వైద్య సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. చేవెళ్ల నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలనే ఏళ్ల నాటి కలకు నిధులు మంజూరైనా నిర్మాణానికి నోచుకోవటం లేదు. మండల కేంద్రంలో ప్రస్తుతం ఉన్న ఏరియా ఆస్పత్రిని స్థాయి పెంచి వంద పడకలుగా అప్‌గ్రేడ్ చేశారు. దీనికిగాను 17కోట్ల నిధులు సైతం గత ప్రభుత్వ హయాంలోనే విడుదల చేసినా ఇప్పటివరకు అడుగు ముందుకు పడటం లేదు. ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి వద్ద స్థలం వంద పడకల ఏర్పాటుకు సరిపోదని ఏదైనా విశాలమైన ప్రభుత్వ స్థలం కేటాయిస్తే అందులో నిర్మించాలనే ఆలోచనలో స్థానిక నాయకులు, అధికారులు ఉన్నారు. స్థలం కేటాయించాలని స్థానిక వైద్యాధికారులు రెవెన్యూ అధికారులను కోరారు. ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి 50 పడకలు అయితే 25 పడకలే కొనసాగుతోంది. ప్రస్తుత అవసరాలకే ఈ పాత భవనం సరిపోవటం లేదు. వంద పడకలకు అయితే మరింత పెద్ద భవనం అనువైన స్థలం ఉంటే బాగుంటుందని మండల ప్రజలు పేర్కొంటున్నారు.

స్థలం కేటాయింపులో జాప్యం

వంద పడకల ఆస్పత్రికి కావాల్సిన స్థలం కేటాయింపులో జాప్యం జరుగుతోంది. దీని కోసం మండల కేంద్రంలో ఉన్న పలు ప్రభుత్వ స్థలాలను స్థానిక ఎమ్మెల్యే, నాయకులు, అధికారులు పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి స్థలంతో పాటు పక్కనే ఉన్న ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు ఉన్న స్థలాన్ని, సర్వే నెం.75లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని, కందవాడ రెవెన్యూలోని జంగం గుట్టలో ఉన్న ప్రభుత్వ భూములను ప్రాథమికంగా ఆస్పత్రి కోసం కేటాయించాలని నాయకులు, అధికారులు యోచిస్తున్నారు. ఈ స్థలాల ఎంపికలో కొన్నింటికి పలు అడ్డంకులు ఉండడంతో వదిలేశారు. కందవాడ రెవెన్యూ పరిధిలో ఉన్న స్థలం అందుబాటులో ఉన్నా.. ఇది పట్టణ కేంద్రానికి దూరంగా ఉండటంతో ప్రజలకు ఇబ్బంది అవుతుందనే ఆలోచనలో ఉన్నారు. నిధులు ఉన్నా స్థలం లేక నిర్మాణం చేయలేని పరిస్థితిలో ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య చొరవ తీసుకొని ఆస్పత్రి నిర్మాణానికి కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. స్థలం కేటాయింపుపై తహసీల్దార్ కృష్ణయ్యను వివరణ కోరగా.. తమకు ఉన్నతాధికారుల నుంచి ఆస్పత్రికి స్థలం కేటాయించాలనే ఉత్తర్వులు రాలేదు. కానీ స్థానిక వైద్యాధికారులు, ఎమ్మెల్యే సూచనలతో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను చూపించాం. అందులో ఏ స్థలం కావాలంటే అది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కేటాయిస్తాం.

నిర్మాణానికి కృషి చేస్తున్నాం



వంద పడకల ఆస్పత్రి ఏర్పాటుతో ప్రజలకు అన్ని వసతులు, మెరుగైన ఆరోగ్యం అందించే వెలుసుబాటు కలుగుతుందని త్వరగా నిర్మాణం జరిగేందుకు కృషి చేస్తున్నాం. ఉన్నతాధికాలకు నివేదికలను అందించాం. స్థలం కేటాయింపు కోసం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ఇచ్చాం. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు స్థలం కేటాయింపు విషయంలో సహకరిస్తే త్వరగా ఆస్పత్రి నిర్మాణం జరుగుతుంది.

– డా.రాజేంద్రప్రసాద్, సూపరింటెండెంట్, చేవెళ్ల

స్థలాన్ని పరిశీలించాం



చేవెళ్లలో వంద పడకల ఆస్పత్రి కోసం 17 కోట్ల నిధులను మంజూరు చేయించాను. అయితే ప్రస్తుతం ఉన్న స్థలం సరిపోదని, అనువైన స్థలం కోసం మూడు స్థలాలను పరిశీలించాం. వాటిలో ఒకదానిని కేటాయించి త్వరగా ఆస్పత్రి నిర్మాణం చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం పూర్తి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంది. వంద పడకల ఆస్పత్రితో మెరుగైన వైద్యసేవలు పేద ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.

– కాలె యాదయ్య, ఎమ్మెల్యే, చేవెళ్ల

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

సూపర్‌వైజర్ కళావతి


పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ కళావతి

షాబాద్: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని నాగర్‌గూడ అంగన్‌వాడీ టీచర్ అంబుజాక్షి, సూపర్‌వైజర్ కళావతి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని నాగర్‌గూడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణులకు రక్తహీనత అనేది ప్రధాన సమస్య అని, దానిని పోషకాహారం ద్వారానే ఎదుర్కోగలమని తెలిపారు. గర్భిణులు సక్రమంగా పోషకాహారం తీసుకుంటే పుట్టబోయే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు జంగమ్మ, స్వరూపారాణి, ఆయా సంతోష తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి


స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

చేవెళ్ల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను గౌరవించి, ఆయన ఆశయ సాధనకు బీజేపీ కృషి చేస్తోందని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం పరిసర ప్రాంతంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. దేశ వ్యాప్తంగా 14న అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని అంబేడ్కర్ విగ్రహాల పరిసరాలను శుభ్రం చేయాలని పార్టీ నాయకత్వం పిలుపునిచ్చిందన్నారు. ఇందులో భాగంగానే చేవెళ్లలో ఈ కార్యకమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌పై కపట ప్రేమను చూపిస్తోందన్నారు. ఆయనను ఆనాడు అవమానించింది ఎన్నికల్లో ఓడించింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తుచేశారు. పేద ప్రజలకోసం ఎంతో శ్రమించిన అంబేడ్కర్ ఆశయాలను బీజేపీ దేశవ్యాప్తంగా అమలు చేస్తోందన్నారు. ఈ నెల 14న అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పార్టీ నాయకులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి, పార్టీ నాయకులు శ్రీను, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్, కృష్ణగౌడ్, మోహన్, శ్రీకాంత్, అభి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీను, శేఖర్, మధుకర్, శ్రీనివాస్‌రెడ్డి, జయసింహ, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి


మాట్లాడుతున్న నాయకులు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లచ్చిరెడ్డి

కొందుర్గు: స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లచ్చిరెడ్డి అన్నారు. శనివారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎదిర రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించి పార్టీ గెలుపే ధ్యేయంగా అందరూ పనిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. పార్టీ అభివృద్ధికి పనిచేసిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందన్నారు. సమావేశంలో నాయకులు కోనేరి శ్రీనివాస్‌తో పాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం


వేణుగోపాల్‌రావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

షాద్‌నగర్: బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన వేణుగోపాల్‌రావును శనివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో వేణుగోపాల్‌రావును శాలువాతో సత్కరించి అభినందించారు. భవిష్యత్‌లో మరిన్నీ ఉన్నత పదవులను అధిరోహించి మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని ఆకాంక్షించారు. తోటి న్యాయవాదులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పథకం నిరుపేదలకు వరం

ఎమ్మెల్యే కాలె యాదయ్య


సన్నబియ్యంతో వండిన భోజనం చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

చేవెళ్ల: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకం నిరుపేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శనివారం మున్సిపాలిటీలోని అంబేడ్కర్ కాలనీలో కందాడ మానిక్యం ఇంట్లో వారి కుటుంబసభ్యులతో కలిసి ఆయన సన్నబియ్యంతో వండిన భోజనం చేశారు. ఈ సందర్భంగా వారిని బియ్యం ఎలా ఉన్నాయి.. తింటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద ప్రజల కడుపు నింపేందుకు ఈ పథకం తీసుకొచ్చిందన్నారు. కాంగ్రెస్‌తోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందన్నారు. అంబేడ్కర్ కాలనీలోని ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వారి సమస్యలపై స్థానిక నాయకులు, అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ కృష్ణయ్య, పీఏసీఎస్ చైర్మన్‌లు వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, నాయకులు వీరేందర్‌రెడ్డి, ఎం.కృష్ణారెడ్డి, బి.రాములు, ఆగిరెడ్డి, గంగి యాదయ్య, టేకుపల్లి శ్రీను, జి.రాములు, భీమయ్య, లక్ష్మారెడ్డి, ఎం.శ్రీనివాస్, దయాకర్, సుశాంత్ తదితరులు ఉన్నారు.

పాఠశాలకు ల్యాప్‌టాప్స్ అందజేత


సిబ్బందికి ల్యాప్‌టాప్స్ అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

మొయినాబాద్: మండల పరిధిలోని శ్రీరాంనగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు యునైటెడ్ వే ఆఫ్ హైదారాబాద్ ఆకృతి సంస్థ ల్యాప్‌టాప్స్ అందజేసింది. శనివారం పాఠశాలకు వచ్చిన సంస్థ ప్రతినిధులు ఆరు ల్యాప్‌టాప్‌లను అందించారు. విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అందించేందుకు వాటిని ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ వినోద, సంస్థ ప్రతినిధులు అస్మా, సయ్యద్ ఆరీఫుద్దీన్, రాజేశ్, ప్రధానోపాధ్యాయుడు జంగయ్య, ఉపాధ్యాయులు సుజాత, స్వర్ణలత, రవి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

జైబోలో హనుమాన్‌కీ..


షాబాద్: కుర్వగూడలో పూజల్లో పాల్గొన్న బాల బ్రాహ్మణులు


కొందుర్గు: రేగడిచిల్కమర్రిలో స్వామివారి పూజలో పాల్గొన్న భక్తులు

రామలక్ష్మణ జానకీ.. జై బోలో హనుమాన్‌కీ అంటూ నినాదాలతో గ్రామాలు మార్మోగాయి. ఊరు, వాడా కాషాయ జెండాలు రెపరెపలాడాయి. శనివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో ఉదయం నుంచే హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు. అనంతరం విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, ఆధ్వర్యంలో వీర హనుమాన్ విజయయాత్ర ప్రారంభించారు. గ్రామాల్లోని పురవీధుల్లో కొనసాగిన శోభాయాత్రలో బీజేపీ, బీజేవైఎం నాయకులు, వివిధ సంఘాల నాయకులు, యువకులు కాషాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు.


చేవెళ్ల: ఆలూరులో శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు


షాబాద్: కేసారంలో..


మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్‌లో..


చేవెళ్లలో వీరహనుమాన్ శోభాయాత్ర


షాద్‌నగర్: పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

ఘనంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం


రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: పట్టణంలోని జానంపేటలో గల లక్ష్మీవేంకటేశ్వస్వామి దేవాలయంలో వారంరోజులుగా మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు ఆధ్వర్యంలో స్వామివారి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర క్యావర్గ సభ్యుడు అందె బాబయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి విశ్వం, మాజీ ఎంపీపీ వన్నాడ ప్రకాశ్‌గౌడ్, మున్సిపల్ మాజీ కో–ఆప్షన్ సభ్యుడు ఒగ్గు కిషోర్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు అందె మోహన్, మాజీ మున్సిపల్ వార్డు సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.